

అర్జీలే అర్జీలు

రెవెన్యూ సదస్సులకు ఫిర్యాదుల వెల్లువ

తొలిరోజు 32 మండలాల్లో 456 వినతులు

అనంతపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు బాధితులు వినతిపత్రాలను సమర్పించారు. అక్కడికక్కడే రికార్డులను పరిశీలించి, వారికి న్యాయం చేయడానికి ప్రయత్నించారు. తొలిరోజు 32 మండలాలలోని 35 రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించారు. మొత్తం 456 మంది వినతిపత్రాలు సమర్పించారని డీఆర్వో మలోలా తెలిపారు.

ఆ చట్టం రద్దుతో రైతులకు ఊరట: కాలవ



ఉడేగోళంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న విప్ కాలవ

కణేకల్లు: ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు ఊరట కలిగించారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఉడేగోళంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. జగన్ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని తమ అనుకూలురకు అప్పజెప్పేందుకు కుట్ర చేసిందని అన్నారు. దీనిపై చంద్రబాబు రైతులలో చైతన్యం తెచ్చారని అన్నారు. వైసీపీ హయాంలో రీసర్వే పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. తమ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. ఉడేగోళం గ్రామం జలజీవన్, స్వచ్ఛభారత్‌లో వందశాతం ఫలితాలు సాధించి, జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా నిలవడం హర్షణీయమని అన్నారు. సర్పంచ్ లావణ్య, క్లస్టర్ ఇన్‌చార్జి మారుతిప్రసాద్‌లను అభినందించారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు లాలెప్ప, హనుమంతరెడ్డి, ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులను వదిలిపెట్టం : పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: వైసీపీ హయాంలో భూ కబ్జాలకు పాల్పడ్డవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. కనుముక్కలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. యజమానులకు తెలియకుండా భూములను అమ్మడం, ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేయడం వంటి అక్రమాలలో వీఆర్వో మహేశ్వర రెడ్డి పాత్ర ఉందని అన్నారు. ఆయన చర్యలు తీసుకోవాలని ధర్మవరం ఆర్డీఓ మహేశ్‌ను కోరారు. కుటుంబ తగాదాలను స్వయం గా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. వీఆర్వోపై అనేక ఫిర్యాదులు వచ్చాయని, విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపుతామని ఆర్డీఓ తెలిపారు. వీఆర్వోపై కచ్చితంగా చర్యలు ఉంటాయని అన్నారు. సదస్సులో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై ఫిర్యాదు చేయండి: దగ్గుపాటి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం రూరల్: భూకబ్జాలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బాధితులకు సూచించారు. అనంతపురం రూరల్ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ హరికుమార్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రసంగించారు. జేసీ శివనారాయణ్ శర్మ, ఆర్డీఓ కేశవనాయుడు హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువ శాతం భూ ఆక్రమణలపై అర్జీలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున భూకబ్జాలు జరిగాయని ఎమ్మెల్యే అన్నారు. అమాయకులను బెదిరించి భూములు లాగేసుకున్నారని అన్నారు. భూ కబ్జాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారని, ఎంతటి వారినైనా జైలుకు పంపుతామని అన్నారు. నియోజకవర్గంలో సర్వేయర్ల కొరత ఉందని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. మండలానికి రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీ భవనాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. వంకలలో ఆక్రమణలు తొలగించాలని కోరారు.

సమస్యలను పరిష్కరిస్తాం: జేసీ

'మీ గ్రామంలో మీ సమస్యల పరిష్కారానికి మీ భూమి-మీ హక్కు నినాదంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జేసీ శివనారాయణ శర్మ అన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మాత్రం తమకు అవకాశం ఉండదని అన్నారు. అలాంటి వాటిని కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం ఆనంద్, ఎంపీడీఓ దివాకర్, పంచాయితీ కార్యదర్శి శ్రీధర్‌రావు, సర్పంచు ఉదయశంకర్, ఎంపీటీసీ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బెళుగుప్ప మండలం తగ్గుపర్తి స్కూల్ ఆవరణలో టెంకాయ పట్టలు



అనంతపురం రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌లో వేదిక

బడిలో పండుగ

నేడే మెగా పీటీఎం నిర్వహణ

అనంతపురం విద్య, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో కొత్త పండుగ రోజు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను (పీటీఎం) శనివారం ఘనంగా నిర్వహించనుంది. జిల్లాలోని అన్ని పాఠశాలలు ఈ వేడుకకు సిద్ధమయ్యాయి. జిల్లాలో 1480 జడ్పీ, ఎంపీపీ పాఠశాలలు, 152 మున్సిపల్ పాఠశాలలు, 32 కేజీబీవీలు, 15 ప్రభుత్వ పాఠశాలలు, 15 మోడల్ స్కూళ్లతోపాటు వెల్ఫేర్, సొసైటీ, ఎయిడెడ్ స్కూళ్లలో ఏర్పాట్లు చేశారు. 1738 పాఠశాలలలో 2.06 లక్షల మంది విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ (హెచ్‌పీసీ) కార్డులు అందిస్తారు. విద్యార్థుల పురోగతిని వివరిస్తారు. తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. పాఠశాలలకు మామిడి తోరణాలు, టెంకాయ పట్టలు కట్టి అందంగా ముస్తాబు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా సిద్ధం చేశారు. వచ్చిన వారు కూర్చునేందుకు కుర్చీలను సిద్ధం చేశారు. స్థానిక ప్రతిప్రతినిధులను వేడుకలలో భాగస్వాములను చేయనున్నారు. ఎక్కడా ఫ్లెక్సీలు, హడావుడి, రాజకీయాలు లేకుండా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. అందుకు సంబంధించిన మెనూను విద్యాశాఖ విడుదల చేసింది.

పండుగలా నిర్వహించాలి: కలెక్టర్

నేటి రెవెన్యూ సదస్సులు రద్దు



అనంతపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ డే వేడుకలను పండుగలా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, నిబంధనలను పాటించాలని సూచించారు. తాను ఉరవకొండ నియోజకవర్గంలో మంత్రి తరఫున హాజరవుతానని తెలిపారు. భోజనం మెనూలో ప్రభుత్వం మార్పులు చేసిందని, ఆ మేరకు భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన సమయానికి సమావేశాలు జరగాలని, పిల్లలందరూ యూనిఫామ్ ధరించేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలలకు విరాళాలు ఇచ్చినవారిని, ఇచ్చేవారిని గుర్తించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మంచి నీరు, టీ తదితర సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమావేశాలు ముగిసిన వెంటనే వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించాలని సూచించారు. మెగా పేరెంట్స్ డే నేపథ్యంలో శనివారం జరగాల్సిన రెవెన్యూ సదస్సులను రద్దు చేశామని తెలిపారు. మరొక రోజు పొడిగించుకోవాలని ఆదేశించారు.

రాశిలోనే మొలకలు

పాడైపోతున్న వరి ధాన్యం

వర్షాలకు తడిసి.. తీవ్రనష్టం

శింగనమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోత కోసిన వరి వర్షానికి తడిసి ఎందుకూపనికి రాకుండాపోతోంది. తుఫాను ప్రభావాన్ని అంచనా వేయలేక కొందరు రైతులు వరి పంటను కోసి.. కుప్పలుగా వేశారు. మరికొందరు యంత్రాలతో నూర్పిడి చేయించి.. ధాన్యాన్ని ఆరబోశారు. వారం రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో రాశిగా పోసిన వరి ధాన్యానికి మొలకలు వస్తున్నాయి. దీంతో కొరివిపల్లి, జూలాకాల్వ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఐదు నెలాలు పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఎరువులు, పురుగు మందులకు రూ.లక్షలు వెచ్చించారు. తీరా దిగుబడి చేతికి వచ్చే సమయంలో తుఫాను దెబ్బకొట్టింది. వర్షం కురుస్తుండటంతో ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా చేశారు. రాశులకు టార్పాలిన్ కప్పారు. అయినా, మొలకలు వస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



రాశిలో మొలకెత్తిన వరిధాన్యం



కొరివిపల్లిలో రోడ్డు మీద ఆరబోసిన ధాన్యం

పొలంలోనే మొలకలు..



నేను ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. వర్షాలు రావడంతో పంట కోత పది రోజులు ఆలస్యమైంది. దీంతో పొలంలోనే మొలకలు వస్తున్నాయి. దీంతో వర్షంలోనే కోత కోసి ధాన్యాన్ని రాశిగా పోశాము. పట్టలు కప్పి ఐదు రోజులు అవుతోంది. ఎండ కాయడం లేదు.. మబ్బులు వీడటం లేదు. శుక్రవారం కొద్దిగా ఎండకాయడంతో రాశులలో పంటను ఆరబోయాలని చూశాం. అప్పటికే ధాన్యం మొలకెత్తింది. ప్రాణం పోయేంత పని అయింది. పంట కోసం రూ.2.50 లక్షలు ఖర్చు చేశాను. కొనే నాథుడే లేదు. ఏం చేయాలో తోచడం లేదు.

-ప్రభాకర్



మొలకెత్తిన వరిధాన్యాన్ని ఏరివేస్తున్న మహిళ

కటింగ్ బియ్యమే..

నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. పంట కోశాక పూర్తి స్థాయిలో తడిసిపోయింది. కొనుగోలు చేయడానికి ఎవరు రాలేదు. బియ్యం ఆడించి అమ్ముకుందామన్నా విలువ లేకుండా పోయింది. తడిసిన వరి ధాన్యాన్ని ఆడిస్తే సగానికి పైగా కటింగ్ బియ్యం వస్తాయి. పెట్టుబడి కూడా తిరిగి రాదు.

- కుళ్లాయప్ప

ప్రభుత్వమే కొనాలి..

మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఎకరానికి రూ.40 వేలకుపైగా పెట్టుబడి పెటాను. దిగుబడి బాగానే వచ్చింది. పంట పూర్తిగా తడసిపోవడంతో కొనడానికి ఒక్క వ్యాపారీ రాలేదు. ప్రభుత్వమే కొనుగోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

-నాగభూషణ

గిట్టుబాటు ధర ఇవ్వాలి..



వర్షంలో తడిసి పోయిన వరి ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. అధికారులు స్పందించి ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయాలి. వరి ధాన్యాన్నిఇ గిట్టుబాటు ధర కల్పించి.. సేకరించాలి.

- చిన్నప్ప యాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

అనుమతి వస్తే కొంటాం..



వరి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

- అన్వేష్ కూమార్, ఏఓ



గాంధీ సర్కిల్ సమీపంలో గుంతలు

దారి పొడవునా గుంతలు

గుత్తి పట్టణంలో రోడ్లు గుంతలమయమయ్యాయి. గుంతకల్లు రోడ్డులో ప్రమాదకరంగా మారాయి. గాంధీసర్కిల్ సమీపంలో రహదారి ధ్వంసమైంది. ఈమార్గంలో గుంతకల్లు, బళ్లారి, హోస్పేట్ తదితర ప్రాంతాలకు భారీ వాహనాలు వెళుతుంటాయి. దీంతో దారి మొత్తం దెబ్బతింది. మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. భారీ వాహనాలు దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి, గుత్తి



గుంతకల్లు రోడ్డులో ఏర్పడిన గుంతలు

నేమకల్లుకు ఆర్టీసీ బస్సు

హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబు

బొమ్మనహాళ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేమకల్లు పర్యటనలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ వారం లోపే అమలైంది. నేమకల్లు ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం శుక్రవారం బస్సు సర్వీసును ప్రారంభించారు. గత నెల 30న పింఛన్ల పంపిణీ కోసం గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రికి ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విన్నవించారు. ఆర్టీసీ బస్సు వస్తే విద్యార్థులకు, తమకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాయదుర్గం నుంచి కణేకల్లు క్రాస్, ఎల్‌బీ నగర్, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ గ్రామాల మీదుగా నేమకల్లుకు బస్సు చేరుకుంటుందని, తిరిగి నేమకల్లు క్రాస్, బెంచ్‌కొట్టాల మీదుగా బళ్లారికి వెళుతుందని రాయదుర్గం డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్ పూల నాగరాజుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బసప్ప, హనుమంతరెడ్డి, గాదిలింగ, రమేష్, జనసేన మండల కన్వీనర్ శివరాజ్, జనసేన నాయకుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



నేమకల్లులో ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఆరు మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో గురువారం జిల్లాలోని ఆరు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా యాడికిలో 20.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 13.2, గుత్తి 4.2, పెద్దపప్పూరు 2.8, అనంతపురం 2.2, విడపనకల్లు 1.0 మి.మీ వర్షపాతం నమోదయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పుట్టిన తేదీతో...

పుట్టెడు కష్టాలు..!

- పేరు, పుట్టిన తేదీ మార్పునకు ఇబ్బందులు
- ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు

సందిగ్ధం..!

- కొత్త రేషన్‌కార్డుల జారీపై స్పష్టత కరువు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- దరఖాస్తులు స్వీకరించని వైనం
- మార్గదర్శకాలు రాలేదంటున్న సిబ్బంది

వివరాలు 9లో..

అభివృద్ధికి అటవీశాఖ అడ్డు

దశాబ్దాలుగా ప్రగతి లేని తిమ్మమ్మ మర్రిమాను

ఆ శాఖ ఆధీనంలో భూములు

(8లో..)



కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడి మృతి

పదవి వచ్చిన మరుసటిరోజే...



తిమ్మారెడ్డి

గుంతకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ముసలిరెడ్డిగారి తిమ్మారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా మృతిచెందారు. పట్టణాధ్యక్షుడిగా ఆయన గురువారం నియమితుడయ్యారు. 24 గంటలు గడవకనే మరణించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో పార్టీ నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేసిన తిమ్మారెడ్డి, ర్యాలీలో నడుస్తూ.. మెయిన్ రోడ్డు సమీపంలో కుప్పకూలిపోయారు. ఆయనను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి.. అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి గుంతకల్లుకు వచ్చి నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు.. తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తూగో జిల్లాలో రోడ్డు ప్రమాదం

చుక్కలూరువాసి మృతి


శ్యామర్ల నరసింహులు(ఫైల్)

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చుక్కలూరుకు చెందిన శ్యామర్ల నరసింహులు(30) మృతి చెందారు. దానిమ్మ పండ్ల లోడ్‌తో నరసింహులు అనంతపురం నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా.. దూబచర్ల వద్ద వ్యాన్ ముందు టైరు పేలి అదుపు తప్పింది. డివైడర్ అవతల వైపునకు దూసుకెళ్లి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నరసింహులు అక్కడిక్కడ మృతి చెందారు. వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. దానిమ్మకాయల లోడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు కాయల కోసం ఎగబడ్డారు. నరసింహులుకు భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సోమరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్

లాభాల నేరేడు

పండ్లతో జ్యూస్, జామూన్ తయారీ


బాక్సుల్లో నిలువ ఉన్న నేరేడు పండ్లు

ఎనిమిదేళ్ల కష్టం...

ఏడాదిలో జూన్, జూలై దిగుబడి బాగా వస్తుంది. మార్కెట్లో నేరేడు పండ్లకు మంచి ధర ఉంటే వాటినే నేరుగా విక్రయిస్తాం. మార్కెట్లో ధర లేనప్పుడు వాటిని జ్యూస్, జామూన్, పౌడర్ తయారు చేస్తాం. అప్పుడు 45రోజుల పాటు కూలీలతో పని ఉంటుంది. అప్పుడు ఒక్కో కూలీకి రోజుకు రూ. వెయ్యి కూలి ఇస్తాం. రూ. 30 లక్షల విలువైన యంత్రాలను తెచ్చుకున్నాను. వాటితో తయారు చేసిన జ్యూస్, జా మూన్, పౌడర్‌ను గాజు సీసాను నిల్వ ఉంచుతాం. ఏడాది వరకు ఏమీ కాదు. ఎప్పుడు ఆర్డర్ వస్తే అప్పుడు వాటిని ఎగుమతి చేస్తాం. గత ఏడాది ఐదు టన్నుల నేరేడు జ్యూస్, జామూన్ తయారీ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించాను. ఈసారి మరికొంతమంది రైతులు సాగు చేసిన నేరేడు పండ్లను కొనుగోలు చేసి దాదాపు 22 టన్నుల జ్యూస్ చేసి అమ్మకాలు చేశాను. ఎనిమిదేళ్లుగా అనేక ప్రయోగాలు చేసి ఒడిదొడుకులను ఎదుర్కొని విజయం సాధించాను. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో నేరేడు జ్యూస్‌ను ఉచితంగా పంపిణీ చేసి మార్కెట్లో పేరు సంపాదించాను. నేరేడు జ్యూస్ తయారీకి ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇక్కడ ఉండే యువతకు మరింత ఉపాధి లభిస్తుంది. జ్యూస్ తయారీ పరిశ్రమలో యువతకు పని లభిస్తుంది.

- మారుతి ప్రసాద్,
నేరేడు రైతు, ఉద్దేహాళ్


నేరేడు పండ్లతో తయారు చేసిన జ్యూస్, జామూన్

అల్లనేరేడు పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ రైతు మారుతి ప్రసాద్. 2008లో తన రెండు ఎకరాల్లో 150 అల్లం నేరేడు చెట్లు వేశాడు. మూడేళ్ల నుంచి పంట దిగుబడి వస్తోంది. అయితే ఈ పంట జూన్, జూలై మాసాల్లో దిగుబడి వస్తుంది. ఒక్కొక్కసారి వచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టపోయాడు. దీంతో ఈ కష్టాలను గట్టెక్కడానికి కొత్తగా ఆలోచించాడు. ఆ నేరేడు పండ్లతో జ్యూస్, జామూన్, పౌడర్ తయారు చేయడం ప్రారంభించాడు. దీంతో అధిక లాభాలు పొందాడు. -ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్

ఎనిమిదేళ్ల కష్టం..
రెండేళ్లుగా ఫలితం
ఉద్దేహాళ్ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
ప్రభుత్వం సహకరిస్తే మరింతమందికి ఉపాధి


దిగుబడిని చూస్తున్న మారుతిప్రసాద్

ప్రయోజనాలు అనేకం..

సహజంగా పండిన నేరేడు పండ్లు, ప్రకృతి సిద్ధమైన పదార్థాలతో తయారైన జామూన్ పౌడర్ వాడటం వల్ల మధుమేహం అదుపులో ఉంటుంది. బ్లడ్ షుగర్ స్థాయిల హెచ్చుతగ్గులను నియంత్రిస్తుంది. జామూన్, జ్యూస్, జామూన్ క్యాప్సూల్స్‌తో పాటు జామూన్ పౌడర్ కూడా ప్రభావంతంగా పనిచేస్తుంది. వీటిని వాడటం ద్వారా మంచి జీర్ణశక్తి, ఆరోగ్యం బాగుంటుంది. నేరేడు పండ్లు మంచి రుచిని అందించడమే కాకుండా శరీరానికి చాలా రకాల ప్రయోజనాలను కలిగిస్తాయి. ఇంకా వీటితో తయారు చేసిన జ్యూస్‌ను ఉపయోగించడం వల్ల మంచి ప్రయోజనాలు కలుగుతాయి. ఈ జ్యూస్‌లో పోషక గుణాలు లభించడమే కాకుండా శరీరాన్ని వ్యాధుల నుంచి సంరక్షించే శక్తి కూడా ఉంటుంది.


అరుంధతి నక్షత్రాన్ని చూపుతున్న వరుడు

ఫ్రాన్స్ యువతితో గొల్లపల్లి యువకుడి వివాహం

హిందూపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన సందీప్ యాదవ్ ఫ్రాన్స్ అమ్మాయి అడ్‌సవిన్‌ను శుక్రవారం వివాహం చేసుకున్నారు. హిందూపురం మండల పరిధిలోని తూమకుంట వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాలులో హిందూ సంప్రదాయం ప్రకారం వీరు ఒక్కటయ్యారు. గొల్లపల్లి రైతు కేశప్ప, గంగమ్మ దంపతుల 11వ సంతానం సందీప్ యాదవ్. ముంబయి ఐటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి, ఫ్రాన్స్‌లోని సీఎన్ఆర్ యూనివర్సిటీలో నానో ఫిజిక్స్ రీసర్చ్ సెంటర్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తున్నాడు. అక్కడే గూగుల్‌లో పనిచేస్తున్న అడ్‌సవిన్‌తో ప్రేమలో పడ్డాడు. రెండు కుటుంబాలవారు సమ్మతించడంతో పెళ్లిని ఘనంగా నిర్వహించారు. ఫ్రాన్స్ నుంచి వచ్చిన వధువు బంధువులు ఇక్కడి సంప్రదాయ దుస్తులను ధరించి వేడుకలలో పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.36



అనంతపురం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.36తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 975 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.20 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.36వేలు



అనంతపురంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,100, కనిష్ఠంగా రూ.14వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 26 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రెండోరోజూ న్యాయవాదుల దీక్ష

అనంతపురం క్రైం,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ కోర్టు బదిలీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా రెండో రోజూ న్యాయవాదులు రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్ష కొనసాగింది. మహిళా న్యాయవాదులు దీక్షలో కూర్చున్నారు. జిల్లాలో ఎన్‌డీపీఎస్ కోర్టు ఉంచకుండా తిరుపతికి కేటాయించడం సబబు కాదన్నారు. వెంటనే ఈ విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. దీక్షలో మహిళా న్యాయవాదులు పద్మజ, శశికళ, మనోరమ, వహీదా, లక్ష్మి, పద్మావతి, కవిత, జ్యోతి, ప్రియాంక, రాధ, అనుపమ, శాంతి, శ్రావణి, హేమావతి, ఉమామహేశ్వరి, భాను, అనిత,దీప, నీరజ, మహేశ్వరి, చైతన్య, సుజాత, అలివేలమ్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్కేయూ అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024 పోటీలు శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరామ్ తెలిపారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీలు హాజరవుతారన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నార్పల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రాణ ప్రతిష్ఠ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి, కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.


ప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం

వ్యవసాయం కూడా పరిశ్రమే...

ప్రభుత్వం రాయితీలు ఇవ్వాల్సిందే


టమోటాలను లోడ్ చేస్తున్న కూలీలు, రైతు కోటిరెడ్డి సాగు చేసిన టమోటా





ఈ రంగాన్ని కాపాడుకోవాల్సిందే..
రైతు కోటిరెడ్డి
మూడెకరాల నుంచి 70 ఎకరాలకు
అన్నదాత విజయ ప్రస్థానం



వ్యవసాయం కూడా పరిశ్రమే అంటారు తనకల్లు మండలం చీకటిమానుపల్లికి చెందిన రైతు కోటిరెడ్డి. ఎంతోమంది నైపుణ్యంలేని అసంఘటిత కార్మికులకు పని దొరికే ఏకైక పరిశ్రమ వ్యవసాయం అంటారాయన. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో రైతులకోసం పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందంటారు. వ్యవసాయ పరిశ్రమకు ప్రోత్సాహం అందిస్తే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆయన గట్టిగా నమ్ముతారు. భూమిని, వ్యవసాయాన్ని చిత్తశుద్ధితో నమ్ముకుని, శ్రమనే ఆయుధంగా మలచుకుంటే వ్యవసాయంలో విజయం తప్పకుండా వరిస్తుందంటున్నారు. తండ్రి నుంచి వచ్చిన మూడెకరాల భూమి, రూ.3 వేల అప్పు నుంచి 70 ఎకరాలు కొని, మొత్తంలో వాణిజ్య పంటలు సాగుచేసే స్థాయికి చేరిన కోటిరెడ్డి విజయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం. ఆయన సక్సెస్ స్టోరీ తెలుసుకుందాం.

తనకల్లు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లికి చెందిన కోటిరెడ్డికి మూడు దశాబ్దాల క్రితం తండ్రి నుంచి మూడెకరాల భూమి వచ్చింది. దాంతోపాటు రూ.3 వేలు అప్పు భారం కూడా తప్పలేదు. ఆ రోజుల్లో భూమి విక్రయించినా అప్పు తీరదు. ఏం చేద్దామని కోటిరెడ్డి ఆలోచించారు. ఆఖరుకు భూమినే నమ్ముకుందామన్నారు. వ్యవసాయమే మార్గమనుకున్నారు. ఇతరుల పొలాలను కౌలుకు తీసుకుని, ప్రస్థానాన్ని ప్రారంభించారు. ప్రణాళికబద్ధంగా పంటలు సాగుచేస్తూ లాభాలు స్వీకరిస్తూ వచ్చారు. వాటిని పంటల సాగుకే పెట్టుబడిగా పెట్టారు. వ్యవసాయ భూములు కొంటూ వచ్చారు. అలా 70ఎకరాలు కొనుగోలు చేశారు. వాటిలో బోర్లు వేశారు. ప్రస్తుతం 70 ఎకరాల్లో టమోటా, దోస, కర్బూజా, బొప్పాయిలాంటి వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. రోజూ 50మంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి కల్పిస్తున్నారు. ఈలెక్కన ఏడాది పొడవునా 20 వేలమంది కూలీలకు పని చూపుతున్నారు. ఎకరంలో టమోటా సాగు చేయడానికి రూ.2లక్షలకుపైగా ఖర్చు వస్తున్నా, వెనకాడట్లేదు. 25 ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. కోటిరెడ్డి తోట నుంచి రోజూ 300 నుంచి 500 దాకా టమోటా బాక్సులు మార్కెట్‌కు వెళ్తుంటాయి.

ఎందరు కూలీలు పనికి వచ్చినా, అందరికీ మధ్యాహ్న భోజనం ఇంట్లోనే వడ్డించి అందిస్తారు కోటిరెడ్డి. కూలీలు భోజనానికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు చెబుతారాయన. సొంత భూమి లేనపుడు భూములు కౌలుకు తీసుకుని, పంటలు సాగుచేశారు. ప్రస్తుతం సొంత భూముల్లో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఓ వైపున పురుగు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. మరోవైపు రైతుల నుంచి సేంద్రీయ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.

ప్రోత్సహించాలి

ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు రైతు కోటిరెడ్డి. వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందంటారాయన. డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, ఎరువులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. గత 20 ఏళ్లలో కూలి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పెట్టుబడి అధికమైందనీ, భరించలేక చాలామంది చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని వదిలివేస్తున్నట్లు బాధపడ్డారు. ప్రస్తుతం కూలీలు దొరక్క, ఇతర ప్రాంతాలనుంచి ఆటోల్లో తీసుకురావాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. ప్రతి గ్రామంలో రైతులు, కూలీలు వలస బాట మాని వ్యవసాయంపై దృష్టి సారించాలని కోటిరెడ్డి కోరుతున్నారు.

అభివృద్ధికి అటవీశాఖ అడ్డు

దశాబ్దాలుగా ప్రగతి లేని తిమ్మమ్మ మర్రిమాను.. ఆ శాఖ స్వాధీనంలో భూములు

మొక్కలు నాటడంతో సరి..
అభివృద్ధి పనులు చేపట్టని అధికారులు
ఇతర శాఖలవారిని అడ్డుకున్న సిబ్బంది
ఏళ్లు గడుస్తున్నా.. మారని తీరు
నేటికీ కనీస వసతులు కరువు
పర్యాటకులకు తప్పని ఇబ్బందులు


రింగ్‌రోడ్డు పనులు నిలిపివేసిన దృశ్యం
తిమ్మమ్మ మర్రిమాను

ఉమ్మడి జిల్లాలో పెద్దగా పర్యాటక ప్రాంతాలు లేవు. ఉన్న వాటిల్లో నంబులపూలకుంట మండలం గూటిబైలు గ్రామ సమీపంలో ఉన్న తిమ్మమ్మ మర్రిమాను ప్రముఖమైంది. ప్రస్తుతం ఈ మర్రిచెట్టు తొమ్మిది ఎకరాలకు విస్తరించింది. అయితే ఈ ప్రాంతం దశాబ్దాలు గడిచి.. ఏ మాత్రం అభివృద్ధి చెందలేదు. రోడ్డు సౌకర్యమూ సరిగాలేదు. అక్కడ ఉండటానికి వసతులూ సరిగా లేవు. దీంతో పర్యాటకులు అక్కడ ఉండలేకపోతున్నారు. అటవీశాఖ అధికారుల వింత ధోరణి వల్లే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం లేదని, ఇతర శాఖల వాళ్లు ఇక్కడ అభివృద్ధి పనులు చేస్తుంటే అడ్డుకొంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

నంబులపూలకుంట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):తిమ్మమ్మ మర్రిమాను.. అనేక సంవత్సరాల క్రితమే ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. అంత ప్రముఖమైన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి.. పర్యాటకులను ఆకర్షించేలా చేయాల్సిన అటవీశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు సరికదా... ఇతర శాఖల వారు అభివృద్ధి చేయడానికి వస్తే అడ్డుకొంటున్నారు. ఆ ప్రాంతమంతా అటవీశాఖ వారి ఆధీనంలో ఉంది. దీంతో ఆ ప్రాంతంలో కేవలం మొక్కలు నాటడం తప్పా.. మరే ఇతర పనులూ చేపట్టరాదని తేల్చిచెబుతున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఆ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి పనులూ జరగలేదు. దీంతో తిమ్మమ్మ మర్రిమాను పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారైంది. ప్రపంచ ఖ్యాతి గాంచిన ఈ ప్రాంతం అభివృద్ధికి.. అటవీశాఖే అడ్డుపడుతుండటం విడ్డూరంగా ఉంది.

స్థల చరిత్ర

క్రీస్తుశకం 1315లో బుక్కపట్నంకు చెందిన వెంకటప్ప, మంగమ్మ దంపతులకు తిమ్మమాంబ (తిమ్మమ్మ) జన్మించింది. 1335లో నంబులపూలకుంట మండలంలో గూటిబైలు గ్రామానికి చెందిన రామయ్య, లక్ష్మమ్మ కుమారుడు బాలవీరయ్యతో ఆమెకు వివాహమైంది. పెళ్లిన 15ఏళ్లకు బాలవీరయ్య కుష్టు వ్యాధి బారిన పడతాడు. దీంతో గ్రామస్థులు ఆ దంపతులను గ్రామ బహిష్కరణ చేశారు. ఏడేళ్ల పాటు తిమ్మమాంబ భర్తకు సేవలు చేసింది. 1355లో బాలవీరయ్య మృతిచెందారు. అప్పటి ఆచారం ప్రకారం తిమ్మమాంబ సతీసహగమనం చేసింది. ఆమెను సజీవదహనం చేసుకున్న ప్రాతంలో ఎండిని ఓ మర్రి కొమ్మను నాటారు. ఆ కొమ్మ బతికి చెట్టు అయింది. మర్రి చెట్టు ఊడలు విస్తరించారు. ఈప్రాంతంలో తిమ్మమాంబ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

వెలుగులోకి ఇలా..

కర్ణాటక రాష్ట్రం ములబాగ తాలూకా, దేవరాయిసముద్రం వాసి, జర్నలిస్ట్ సత్యనారాయణ అయ్యార్ 1989లో ఆ మర్రిమానను సందర్శించారు. ఆ సమయంలో ఆ వృక్షం ఏడు ఎకరాలు విస్తరించి ఉండటాన్ని గుర్తించి.. ఆ మాను జీవిత చరిత్రపై అధ్యయనం చేశాడు. దానిపై కథనాలు రాయడంతో ఆ మర్రిమాను గురించి ప్రపంచానికి తెల్సింది. ఆ మర్రిమానును గిన్నీస్ రికార్డుగా గుర్తించారు. దీంతో భారత ప్రభుత్వం సత్యనారాయణ అయ్యార్‌కు దిగ్రేట్ అయ్యార్ అనే బిరుదు కూడా ఇచ్చి .. సన్మానించింది. ప్రస్తుతం ఆ చెట్టు తొమ్మిది ఎకరాలకు విస్తరించింది.

అభివృద్ధికి అడ్డు

● మొదట తిమ్మమ్మ మర్రిమానును తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేసుకోవడానికి ముందుకొచ్చింది. ఆ ప్రాంతం అభివృద్ధికి నిధులు కూడా ఇస్తామని ప్రకటించింది. అయితే తిమ్మమాంబ సమాధి ఉండటంతో.. హైందవ సిద్ధంతం ప్రకారం ఆ ప్రాంతాన్ని విలీనం చేసుకోవాడానికి నిరాకరించింది.

● మర్రిమాను వెనుకభాగంలో ఎత్తైన ఓబుళదేవరకొండపైన బాలాజీ ఆలయం, నిర్మించడానికి ప్రయత్నించినా.. ఆ పనులూ అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆ ఆలయంలో బాలాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి యత్నిస్తున్నారు.


● తిమ్మమ్మ మర్రిమాను చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి అప్పట్లో భూ సేకరణ చేశారు. 1995లో అప్పటి కదిరి ఎమ్మెల్యే జొన్నా సూర్యనారాయణ రింగ్‌రోడ్డు విస్తర్ణలో భాగంగా రైతుల నుంచి భూసేకరణ చేశారు. తర్వాత ఆ విషయం మరుగున పడింది. ఇటీవల మళ్లీ ఈ రింగ్ రోడ్డు నిర్మాణానికి పర్యాటక శాఖ రూ.85 లక్షలు విడుదల చేసింది. ఆ పనులు చేపట్టగా... అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. ఈ స్థలం అటవీశాఖ పరిధిలో ఉందని, ఇక్కడ మొక్కలు నాటడం తప్పా.. ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టరాదని హెచ్చరించింది. దీంతో ఆ పనులు ఆగిపోయాయి. ఇన్నేళ్లకు తమ గ్రామాలకు మంచి రోడ్డు వస్తోందని ఆశించిన.. ఆ చుట్టుపక్కల గ్రామస్థులకు మళ్లీ నిరాశే మిగిలింది.

● ఏటా మహాశివరాత్రి సమయంలో మూడు రోజుల పాటు తిమ్మమాంబ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాలకు స్థలం చాలట్లేదనీ, మూడెకరాలు కేటాంచాలని ఉత్సవ కమిటీ సభ్యులు.. అటవీ అధికారులను విజ్ఞప్తి చేసినా వారు ససేమిరా అన్నారు.

కూటమి చొరవ

తిమ్మమ్మ మర్రిమాను సందర్శనకు వచ్చిన వారు ఉండడానికి విశ్రాంతి గదులు లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవు. తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధి గురించి గత వైసీపీ హయాంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పలుమార్లు నాయకులను విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం సర్పంచ్ ఆధ్వర్యంలో గెస్టు హౌస్, హోటల్‌ను 15 సంవత్సరాలు లీజుకు తీసుకుని నిర్వహించడానికి ముందుకువచ్చారు. దీంతో భవనాలకు రంగులు వేసి, మెరుగులు దిద్దుతున్నారు.


పొలాలిచ్చాం..



తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధి కోసం పొలాలు ఇచ్చాం. ఏళ్లు గడుస్తున్నా అటవీ అధికారులు ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు. తమ పొలాలకు వెళ్లడానికి కూడా రహదారి లేకుండా చేశారు. ఆ అధికారులు ఆ ప్రాంతంలో మొక్కలు నాటడంపై చూపుతున్న శ్రద్ధలో కొంతకూడా మర్రిమాను అభివృద్ధిపై చూపడం లేదు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పిస్తే.. మరింతమంది సందర్శకులు వచ్చే అవకాశముంది.

- విష్ణుమూర్తి, సర్పంచ్

వసతులు కల్పించాలి



తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతంలో సందర్శకులు బస చేయడానికి గదులు లేవు. కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. అలాగే ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ కూడా లేదు. సందర్శకులు వస్తే కనీసం కొద్ది సేపు కూర్చోడానికి వసతి కూడా లేదు. ఏదో ఒక వాహనం పట్టుకుని వెళ్లిపోవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- మనోహర్, టూరిజం గైడ్

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి


వరలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి (54) విద్యుత్‌షాక్‌తో శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వరలక్ష్మి, ఓబులేసుయాదవ్ దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరు ఆవులు కూడా పెంచుతున్నారు. ఆవులకు ప్రతిరోజూ వరలక్ష్మి రైస్‌కుక్కర్‌పై అన్నం వండి పెడుతుండేది. ఇందులో భాగంగానే శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచి ఆవులకు అన్నం పెట్టేందుకు రైస్‌కుక్కర్‌పై అన్నం పెట్టింది. అన్నం ఉడికిన తర్వాత పక్కకు పెట్టాలన్న ఆలోచనతో మూతతీసేందుకు ప్రయత్నించింది. ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్ కొట్టింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. గమనించిన భర్త చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వరలక్ష్మికి కుమారుడు సందీప్‌కుమార్, కుమార్తె మంజులభార్గవి ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కూలీ ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం పాములరాయికి చెందిన రామాంజనేయులు (29) కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా మానలేకపోయాడు. ఈ క్రమంలో మనస్తాపంచెంది శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, రెండేళ్ల పాప ఉన్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


భానుప్రకాష్ (ఫైల్)

గార్లదిన్నె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన కుమ్మర భానుప్రకాష్ అనే యువకుడు కనిపించకుండా పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన కుమ్మర రాము, భాగ్యమ్మ దంపతులు గ్రామంలోనే కులవృత్తి చేసుకుంటూ జీవించేవారు. కుమ్మర రాము కొంతకాలం కిందట మృతి చెందాడు. ఇంటర్ వరకు చదివిన భానుప్రకాష్ తల్లికి తోడుగా ఇంటివద్దనే కుమ్మర వృత్తిని చేస్తుండేవాడు. రెండు రోజుల కిందట భాగ్యమ్మ గుంతకల్లులో బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లింది. తర్వాత ఆమె ఇంటికి తిరిగా రాగా కుమారుడు భానుప్రకాష్ కనిపించలేదు. దీంతో గ్రామంలోను, బంధువుల ఊళ్లలోనూ వెదికినా ఆచూకి కనిపించకపోవడంతో గురువారం రాత్రి గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

పెళ్లిలో చోరీ

- 38 తులాల వడ్డాణాల అపహరణ

పామిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఉన్న ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరుగుతున్న పెళ్లిలో చోరీ జరిగింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రామరాజుపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి కుమార్తె రోషిణి వివాహం పెన్నానది ఒడ్డున ఉన్న ఓ ఫంక్షన్ హాలులో జరుగుతోంది. పెళ్లి కుమార్తె అక్క శృతికి చెందిన రూ.25లక్షల విలువైన 38 తులాల రెండు వడ్డాణాలు చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. రాత్రి రిసెప్షన్‌కు వేసుకొని గదిలో భద్రపరిచిందన్నారు. ఉదయం కనిపించకపోవడంతో భయాందోళనకు గురయ్యారన్నారు. సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడి మృతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ నాయకుడు అంజినరెడ్డి గురువారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం తన పొలంలో నుంచి మడకశిర జాతీయ రహదారిపైకి ద్విచక్ర వాహనంలో రావడంతో అటుగా ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో అంజినరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరుకు తరలించి చికిత్సలు అందించగా ఫలించక మృతి చెందారు. మృతదేహానికి సొంత గ్రామమైన సింగిరెడ్డిపల్లిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంజనరెడ్డి హిందూపురం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌గా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి సేవచేశారు. బీజేపీ నాయకులు పార్థసారథి, రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆదర్శ్, దివాకర్, చలపతి, చంద్ర, చంద్రశేఖర్, బద్రీ, వెంకటనరామిరెడ్డి తదితరులు హాజరై బీజేపీ జెండా మృతదేహంపై కప్పి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టిన తేదీతో... పుట్టెడు కష్టాలు..!

- పేరు, పుట్టిన తేదీ మార్పునకు ఇబ్బందులు
- ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు

గుత్తి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అపార్ కార్డు విద్యార్థులు వారి తల్లిదండ్రులను ముప్పు తిప్పలు పెడుతోంది. ఆరువారాలుగా పాఠశాల, గ్రామసచివాలయాలు, తహసీల్దార్, కార్యాలయాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ, ఒకేవిధంగా వివరాలుంటేనే అపార్ కార్డు జనరేట్ అవుతోంది. ఈ రెండు చోట్ల వివరాలు ఒకే విధంగా మార్పు చేయడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అన్ని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోవడంతో వారి చదువులు వెనకబడుతున్నాయి. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిళ్లు తెస్తుండటంతో వారు ఏం చేయాలో అర్థంకాక అయోమయంలో పడుతున్నారు. అపార్ కార్డు జనరేట్ కావాలంటే పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ ఇంటి పేరు ఒకేరకంగా ఉండాలి. సాధారణంగా పాఠశాలలో ఇంటిపేరుతో పాటు


ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


న్యాయవాది వద్ద అఫిడవిట్ కోసం బారులుతీరిన తల్లిదండ్రులు

విద్యార్థి పేరు ఉంటుంది. కానీ ఆధార్‌కార్డులో వచ్చేపాటికి ఆ సమయంలో ఎక్కువ మంది ఇంటిపేరు పూర్తిగా కాకుండా మొదటి అక్షరం ఇన్షియల్ మాత్రమే పెట్టి నమోదు చేయించుకున్నారు. ప్రస్తుతం అపార్ కార్డు జనరేట్ కావాలంటే ఈ రెండు ఒకేరంగా ఉండాలి. చాలా మందికి రెండు చోట్ల ఒకే రకంగా పేరు ఉండకపోవడంతో అపార్ కార్డులు జనరేట్ కావడం లేదు. ఇంటిపేరు మార్చుకోవాలంటే మొదట జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆ పత్రం కోసం సచివాలయంలో వివరాలు రాసిస్తే వారు తహసీల్దార్‌కు పంపుతారు. అక్కడ నమోదై ఉంటే ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఒకవేళ విద్యార్థి పుట్టినపుడు ఎక్కడా నమోదు చేయకపోతే నాన్ అవైలబుల్ అనే సర్టిఫికెట్‌ను ఆర్డీఓ జారీ చేస్తారు. అక్కడి నుంచి తిరిగి సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి పంపితే అక్కడ జనన ధ్రువీకరణ పత్రం ఇంటిపేరుతో ఇస్తారు. ఈతతంగం పూర్తి కావాలంటే కనీసం 15 నుంచి 20 రోజులు పడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఇంటిపేరు ఆధార్‌కార్డులో తప్పు ఉండడంతో సరి చేసేందుకు రెండు రోజులుగా ఆధార్ కేంద్రం వద్దకు వస్తున్నా. బర్త్ సర్టిఫికెట్ కోసం గుత్తి మున్సిపాలిటీలో ఇవ్వడంతో ఇంటిపేరు కుడా ఇక్కడే మార్చుకోవాలని ఆధార్ సెంటర్‌వారు చెబుతున్నారు. ఇక్కడ మున్సిపాలిటీలో పనికావడంలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

\- పెద్దక్క, గుత్తి అనంతపురం

నాలుగుసార్లు తిరిగినా పని కావడంలేదు



నాకుమారుడు ఇక్కడే పుట్టాడు. అప్పట్లో నల్లదాసరిపల్లి అని కొట్టకుండా కొజ్జేపల్లి అని జనన ధ్రువీకరణ పత్రంలో ముద్రించారు. ఇప్పటికీ గుంతకల్లు నుంచి నాలుగుసార్లు తిరిగినా పనికావడం లేదు. ఎప్పుడు వచ్చినా చూస్తామంటారు కానీ పని మాత్రం చేయలేదు. పనులు వదులుకొని తిరుగతుఉన్నాం.

\- ప్రసాద్, నల్లదాసరిపల్లి

సందిగ్ధం..!

- కొత్త రేషన్‌కార్డుల జారీపై స్పష్టత కరువు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- దరఖాస్తులు స్వీకరించని వైనం
- మార్గదర్శకాలు రాలేదంటున్న సిబ్బంది

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఈనెల 2వతేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించనున్నట్లు ఇదివరకే ప్రకటించింది. దీంతో ఆశావహులు సచివాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకుని, దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సచివాలయాల్లో వారం రోజులుగా ఇందుకు సంబంధించిన యాప్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో ఆశావహులకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిలో సచివాలయ సిబ్బంది ఉంటున్నారు.

సంక్రాంతికి కొత్తకార్డులంటూ..

డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించబోతోందనీ, కొత్త డిజైన్లతో పంపిణీ చేయనుందని కొన్ని రోజులుగా అధికార యంత్రాంగం ప్రచారం చేస్తోంది. సంక్రాంతి పండుగకే కొత్త కార్డులు అందజేస్తుందని కూడా కొందరు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఏం చెప్పాలోనని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. దరఖాస్తులు స్వీకరించాలో.. వద్దో కూడా తెలియని పరిస్థితి.

పది నెలలుగా పెండింగ్

పది నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించడంలేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ను బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారుల ద్వారా తెలుస్తోంది. ఆ తరువాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించడం లేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వైసీపీ రంగులతో ఉన్న రేషన్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ హయాంలో జారీ చేసిన రేషన్ కార్డుల్లో మొత్తం కుటుంబసభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టినతేదీ, వయసు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి, రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో



కుటుంబసభ్యుల ఫొటో తీసేసింది. ఆ కుటుంబంలో మహిళ ఫొటోను మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి.

నిరాశగా వెనుదిరుగుతూ..

కొత్తకార్డులు, స్ప్లిట్‌కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆరంచెల పరిశీలన ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా ఇప్పుడు వంటగ్యాస్ సబ్సిడీకి కూడా కొందరు దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను పొందలేకపోయారు. శ్రీసత్యసాయి జిల్లాలో 5.72 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఇంకా అర్హులు మిగిలిపోవడంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకు సంబంధించి మార్గదర్శకాలు ప్రకటించలేదు. దీంతో సచివాలయాలకు దరఖాస్తులతో వస్తున్నవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

మార్గదర్శకాలు రాలేదు: వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ

రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి క్వార్టర్స్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో కదిరి పట్టణంలోని నిజాంవలీకాలనీకి చెందిన బీటెక్ విద్యార్థి తరుణ్‌సాయి (22) మృతిచెందాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తరుణ్‌సాయి బెంగుళూరులో బీటెక్ చదువుతుండేవాడు. గురువారం రాత్రి గోరంట్లకు చెందిన స్నేహితుడు ఉమేష్‌ను ద్విచక్రవాహనంపై వదిలి వెళ్లడానికి కదిరి నుంచి బయల్దేరాడు. బోయపల్లి వద్ద అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో తరుణ్‌సాయి తలకు తీవ్రగాయాలయ్యాయి. కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తరుణ్‌సాయి మృతిచెందాడు. విద్యార్థి తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ఉమేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ముగిసిన రైల్వే ఎన్నికల పోలింగ్

గుంతకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. 4వ తేదీన దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు కోసం ఎన్నికలను నిర్వహించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో 34, డివిజనల్ కేంద్రంలో 6 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కార్యక్రమం పూర్తయింది. మొత్తం 14,359 ఓట్లకు 12,358 ఓట్లు పోలయ్యాయి. 2001 ఓట్లు పోల్ కాలేదు. పోలింగ్‌లో 11,509 మంది పురుష ఓటర్లు, 849 మంది మహిళా ఓటర్లు ఓట్లువేశారు. 86.06 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులైన పర్సనల్ బ్రాంచ్ ఆఫీసర్లు తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి
- రూరల్ క్రికెట్ లీగ్‌లో సెంచరీల మోత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే సత్ఫలితాలు వస్తాయని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో అండర్-12 మిక్స్‌డ్ రూరల్ క్రికెట్ లీగ్-2024 క్వాలిఫయర్ మ్యాచ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీఎల్ ప్రకాష్‌రెడ్డి పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అవకాశం కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆంధ్రా, భారత్ జట్టుకు ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా క్రీడాకారులు, కోచ్‌లు, సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన అండర్-12లో మ్యాచ్‌లో రాప్తాడు, గుత్తి జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన గుత్తి 19.1 ఓవర్లలో 51పరుగులకే ఆలౌట్ అయ్యింది. తరుణిక, కాత్యాయని, ధన్యత చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన రాప్తాడు 4.1ఓవర్లలో వికెట్ నష్టపోకుండా విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఆత్మకూరు, ధర్మవరం జట్ల మధ్య జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 157 పరుగులు చేసింది. బ్యాటర్ గోవర్ధన్ 98 బంతుల్లో 12 బౌండరీలు, 12 సిక్సర్లతో 139 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన ఆత్మకూరు 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు సాధించింది. ఇందులో గౌతమ్ 46పరుగులు చేశాడు. దీంతో ఆత్మకూరు 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ, గుంతకల్లు రైల్వేస్‌జట్లు తలపడగా టీసీఏ 40ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 307పరుగులు సాధించింది. కౌశిక్ 100పరుగులు, తన్మయి కార్తిక్‌రెడ్డి కేవలం 26బంతుల్లోనే 8బౌండరీలు, 6సిక్సర్లతో 77పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన గుంతకల్లు రైల్వేస్ 33.4ఓవర్లలో 155పరుగులకు ఆలౌట్ అయ్యింది. దేవస్కంద, కుశాల్‌రాయల్ చెరో 3వికెట్లు పడగొట్టారు. తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 152 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, మేనేజర్ సాగర్‌చౌదరి, కోచ్‌లు వంశీకృష్ణ, ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఎల్ ప్రకాష్ రెడ్డి


సెంచరీలు సాధించిన గోవర్ధన్, కౌశిక్, తన్మయి కార్తీక్

అంబేడ్కర్‌కు టీడీపీ నివాళి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఇతర నాయకులు

అనంతపురం డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. నగరంలోని జడ్పీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మేయర్ స్వరూప, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ తరతరాలకు గుర్తుండిపోయే సేవలను అందించారని కొనియాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి రాజ్యాంగం అమలు చేసి అన్ని వ్యవస్థలను విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గంగారామ్, విశాలాక్షి, స్వప్న, సరిపూటి రమణ, కూచి హరి పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితర నాయకులు

రైల్వే మెయిల్ సర్వీస్‌ను నిర్వీర్యం చేయడం తగదు


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంతో చరిత్ర కలిగిన రైల్వే మెయిల్ సర్వీస్‌ను నిర్వీర్యం చేయడం తగదని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి జనార్దన్, యూనియన్ డివిజనల్ కార్యదర్శి జే శ్రీనివాసులు అన్నారు. మొదీనబాదులోని రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయం వద్ద శుక్రవారం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇప్పటికే పోస్టల్ స్టోర్ డిపోను విజయవాడకు, సూపరింటెండెంట్ పోస్టాఫిసెస్‌ను అనంతపురానికి తరలించారని అన్నారు. ప్రస్తుతం రైల్వే మెయిల్ సర్వీస్‌ను ఇతర ప్రాంతాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకండి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్


మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాగా చదవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్, అబ్యూజింగ్ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రగ్ అబ్యూజింగ్ కింద నమోదయ్యే కేసులలో ఉన్న ఇబ్బందులు, అనంతరం తలెత్తే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది హరికృష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

30 మంది ఏఎస్ఐల బదిలీ

- 79మంది హెడ్‌కానిస్టేబుళ్లు కూడా..



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 6: పట్టణాల్లో పనిచేసే పోలీసులను పల్లెలకు (మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లకు) మండలాల్లో పనిచేసే పోలీసులను పట్టణాలకు బదిలీ చేశారు. జిల్లాలో శుక్రవారం 30 మంది ఏఎస్ఐలు, 79 మంది హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ జగదీష్ పోలీసుల బదిలీలకు ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే చోట ఐదేళ్లు పని చేసిన ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వీరిని ప్రస్తుతం పనిచేస్తున్న నియోజకవర్గంలో కాకుండా మరో నియోజకవర్గానికి బదిలీ చేశారు. పిల్లల స్కూల్ విషయంలో ఇబ్బంది అవుతుందన్న నెపంతో కానిస్టేబుళ్ల బదిలీలు జరగలేదని సమాచారం. కౌన్సెలింగ్‌లో ఏఎస్పీ రమణమూర్తి, పోలీస్ అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో అర్జీలు

అనంతపురం రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు అర్జీలు అధిక సంఖ్యలో వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని పరిశీలించి పరిష్కార మార్గాలు సూచిస్తున్నారు. మండలంలోని కాటిగాని కాలువ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 25ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. గ్రామంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఎంపీపీ వరలక్ష్మి, జడ్పీటీసీ చంద్రకుమార్, సర్వేయర్ రఘు, ఆర్ఐ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని మద్దలచెరువు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు తమ సమస్యలను అర్జీల ద్వారా అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కో ఆర్డినేటర్ సుధాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నరేశ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ వెంకటేశులు, అటవీశాఖ ఎస్‌డీఓ శ్రీనివాసులు, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

45 రోజుల్లో పరిష్కరిస్తాం

శింగనమల: రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకి 45 రోజుల్లోపే



లోలూరు ఎస్సీకాలనీలో రెవెన్యూ సదస్సు ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు(శింగనమల)

మండలాల్లో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు
పరిష్కార మార్గాలు సూచిస్తున్న అధికారులు



మద్దలచెరువు గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పరిష్కారం చూపుతామని తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య పేర్కొన్నారు. మండలంలోని లోలూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సదస్సుల స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ జహీర్ అస్లాం, ఎంపీడీఓ నిర్మలకుమారి, ఈఓపీఆర్‌డి వెంకటక్ష్మి, సర్వేయర్ స్టీఫెన్, రీసర్వే డిప్యూటీ సర్వేయర్ పునీత్, టీడీపీ నాయకులు చౌదరి కొండయ్య, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ మోహన్‌కుమార్

భూ సమస్యలు పరిష్కరిస్తాం

రాప్తాడు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలు, రస్తా సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు ఇతర సమస్యలు పరిష్కరించాలని రైతులు అర్జీలు అందచేశారు.

గార్లదిన్నె: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం అవుతాయని మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌నాయక్, తహసీల్దార్ బండారు ఈరమ్మ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులను శుక్రవారం మండలంలోని కొప్పలకొండ గ్రామంలో ప్రారంభించారు. వివిధ రకాల భూ సమస్యలపై మొత్తం 16 ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈఓఆర్డీ దామోదరమ్మ, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి ఆలయంలో శుక్రవారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు అన్నదాన వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నేడు రాప్తాడుకు ఎమ్మెల్యే రాక

రాప్తాడు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మార్కెట్‌లోకి హోండా ఆల్‌న్యూ అమేజ్



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోండా కంపెనీ మరో నూతన మోడల్ కారును మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. శిల్పారామం సమీపంలోని హోండా షోరూం ఆల్‌న్యూ అమేజ్ కారును మార్కెట్‌లోకి శుక్రవారం విడుదల చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్‌బ్యాంకు చీఫ్‌మేనేజర్ శంకర్ పాండ్య, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్లు తిరుమలేష్, ప్రియాంక హాజరయ్యారు. ఈసందర్భంగా షోరూం యజమాని నారాయణరెడ్డి మాట్లాడుతూ..ఆల్‌న్యూ అమేజ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారన్నారు. అధునాతమైన ఇంటీరియర్, భద్రత, విషయంలో అడాస్ టెక్నాలజీ, ఆరు ఎయిర్ బ్యాగులు ఉన్నాయన్నారు. మ్యానువల్, ఆటోమెటిక్‌లలో మూడు వేరియంట్లతో ఆకర్షణీయమైన ఆరు రంగులలో లభిస్తుందన్నారు. ప్రారంభ ధర రూ.7.99లక్షలన్నారు. కార్యక్రమంలో యూట్యూబర్ వైభవ్, ప్రీమియంహోండా సేల్స్ మేనేజర్ రమణారెడ్డి, న్యాయవాది జూటూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతపురంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బళ్లారి బైపాస్‌లో గల ఆర్ఆర్ ఫిజియోథెరపీ కాలేజ్‌లో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చార్లెస్ డేనియల్, కరస్పాండెంట్ ఓబిలేసు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. హైదరాబాదుకు చెందిన అనన్యా సీడీసీ ఆఫ్ ఫిజియోథెరపీ సంస్థ ఈ ఇంటర్వ్యూలు చేపడుతోందన్నారు. తొలిసారిగా జరుగుతున్నా యని అర్హత అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. క్యాంపస్‌నియామకాలకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో రావాలని వారు తెలిపారు.

రుణాలు అందజేస్తాం: బ్యాంకర్లు



దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో బ్యాంకర్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధికి దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు అందజేస్తామని బ్యాంకర్లు పేర్కొన్నారు. స్థానిక రాయలసీమ డెవలెప్‌మెంట్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్లు, జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ ఎంటర్‌ప్రైజ్ వ్యాపార వ్యవస్థాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌డీఎం నర్సింగరావు మాట్లాడుతూ దివ్యాంగ ఔత్సాహిక వేత్తలకు సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తామన్నారు. 52మంది దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంబంధించి రూ.3.85కోట్లు వివిధ పరిశ్రమల స్థాపన కోసం అన్ని బ్యాంకుల్లో దరఖాస్తులు అందాయని తెలిపారు. అర్హులందరికీ రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఏడీ రాజశేఖర్ రెడ్డి, రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు డైరెక్టర్ నిరంజన్, హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ అధికారి బసవరాజు, ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ చంద్రమోహన్, కెనరాబ్యాంకు మేనేజర్ విశ్వనాథ్, యూనియన్ బ్యాంకు అశోక్, ట్రైనర్స్ శ్రీనివాసులు, రామాంజినేయులు, వికలాంగుల సమ్మిళిత అభివృద్ధి విభాగం డైరెక్టర్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం



ఎంఎస్‌ఎంఈ రుణాలు పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పొందగోరు యువతను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని బ్యాంకర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పేర్కొన్నారు. కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మూడోరోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎంఎస్‌ఎంఈ ఔత్సాహికవేత్తలకు రుణమేళా నిర్వహించారు. జిల్లా హ్యాండ్‌లూమ్స్ - టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బసవరాజు, డీఐసీ జిల్లా జనరల్ మేనేజర్ శ్రీధర్, ఎల్‌డీఎం నర్సింగరావు, కెనరాబ్యాంకు ఏజీఎం లారెన్స్‌లు ఎంఎస్‌ఎంఐపై అవగాహన కల్పించారు. పరిశ్రమల శాఖ ద్వారా, టెక్స్‌టైల్ ద్వారా ఉపాధి పొందే మార్గాలను వివరించారు. అనంతరం 150మందికి పైగా మేళాకు హాజరుకాగా...పలువురు ఔత్సాహిక వేత్తలకు రుణాలు పంపిణీ చేశారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతు

ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయని, వాటి మరమ్మతులకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక పరిటాల రవీంద్ర బీసీకాలనీలో రూ.50లక్షలు, పెనుకొండ వైపునకు వెళ్లే రోడ్డు పక్కన కాలనీలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలలో ప్రజలతో మాట్లాడారు. మండలంలో దాదాపు రూ. మూడు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ నారాయణచౌదరి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, చెన్నకేశవులగౌడ్, శివ, అమరేంద్రరెడ్డి, సూరి, కానశివారెడ్డి, న్యామద్దల కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశానికి హాజరుకండి

రామగిరి: పాఠశాలల్లో శనివారం నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. వెంకటాపురంలో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు.



టీడీపీ నాయకులతో కలిసి సీసీరోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మండలంలోని కుంటిమద్ది ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శనివారం ఉదయం 9గంటలకు, రాప్తాడులో ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 11గంటలకు జరిగే సమావేశాల్లో తాను పాల్గొంటున్నట్లు వివరించారు.

అనంతపురంరూరల్: తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సామావేశంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనాలని ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఒక పండుగ వాతావరణంలో సమావేశాలు జరుగుతాయన్నారు. గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు కూడా సమావేశంలో పాల్గొనాలన్నారు.

ఎఫ్‌పీ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో విజిలెన్స్ అధికారులు ఎఫ్‌పీ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. సోమనాథనగర్ రామాలయం గుడి సమీపంలోని రేణుకకు చెందిన పీఎఫ్ షాపులో తనిఖీలు చేపట్టారు. దీంతో రికార్డులు భౌతిక నిల్వలను పరిశీలించి, వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. భౌతిక నిల్వలను జప్తు చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, సీఎస్‌డీటీ ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

రాజ్యాంగమే భారతీయ జీవన విధానం



అంబేడ్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ మే భారతీయ జీవన విధానమని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ పేర్కొన్నారు. ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షిస్తే అదే మనల్ని కాపాడుతుందన్నారు. భారత రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాస రచన, క్విజ్, వక్తృత్వపోటీలలో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో క్రీడలది కీలక భూమిక



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

అనంతపురం విద్య, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితంలో క్రీడలు కీలకభూమిక పోషిస్తాయని వక్తలు పేర్కొన్నారు. గ్లోబల్ విద్యాసంస్థల రెండో వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఆర్డీటీ స్టేడియంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజ్ పూర్వపు ప్రిన్సిపాల్ మురళీధర్‌రావు, పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్ కోచ్ సురేష్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై వేడుకలు ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా రన్నింగ్, తైక్వాండో, కర్రసాము, రైఫిల్ షూటింగ్, డ్యాన్స్ తదితర క్రీడలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. గ్లోబల్ విద్యాసంస్థల అకడమిక్ డీన్ అంజనేయులు, ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి: డీపీఓ

శింగనమల డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు బయోమెట్రిక్ హాజరు వేయాలని, లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని డీపీఓ నాగరాజునాయుడు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశాడు. అనంతరం వర్మికం పోస్టు షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండలరిషత్ కార్యాలయం ఏఓ నాగభూషణరెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి పీవీకేకే ఐటీ పాలిటెక్నిక్ నమూనాలు

అనంతపురంరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్-2024కు పీవీకేకే ఐటీ పాలిటెక్నిక్ కళాశాల నుంచి మూడు నమూనాలు ఎంపికయ్యాయి. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పాలిటెక్ ఫెస్ట్‌లో పీవీకేకే ఐటీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు 12 నమూనాలను ప్రదర్శించారు. ఇందులో రీట్రోఫిటింగ్ పద్ధతులు దాని భద్రత, కార్యాచరణ మెరుగుపరచడానికి ఇప్పటికే ఉన్న భవనాన్ని నవరించడం లేదా అప్‌గ్రేడ్ చేయడం, గ్రానైట్ దుమ్ము, సిమెంట్ ఇటుక వ్యర్థాలను జోడించడం ద్వారా నల్ల పత్తి నేల బలాన్ని మెరుగుపరచడం, వైర్‌లెస్ ఐఓటీ బోర్‌వెల్ ప్రమాదాల నమునాలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. రాష్ట్ర స్థాయికి విద్యార్థుల నమూనాలు ఎంపిక కావడం పట్ల విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ అభినందించారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి

శింగనమల డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టెక్కే వీధిలో కుక్కల దాడిలో బోయ సుదర్శన్‌కు చెందిన 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. శింగనమలకి చెందిన కాపరి బోయ సుదర్శన్ గొర్రెల మందను గ్రామానికి సమీపంలోని టెక్కే దర్గా వద్ద తోలాడు. శుక్రవారం ఉదయం గొర్రెలను మేత కోసం తీసుకెళ్తూ 15 గొర్రెల పిల్లలను ఇనుప కంచెలో వేసి వెళ్లారు. అయితే వీధి కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెపిల్లలు మృతి చెందాయి. రూ.50 వేలు నష్టవాటిల్లినట్లు కాపరి ఆవేదన వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న స్వప్న, నిట్టూరు శివాజీ, సుబ్బన్న

అనంతపురం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. స్థానిక అర్బన్ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, నాయకులు నిట్టూరు శివాజీ, సుబ్బన్న ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి ఎమ్మెల్యే చేతుల మీదుగా పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అలాగే రెండో డివిజన్‌లో పేదలతో సభ్యత్వం చేయించేందుకు నిట్టూరు శివాజీ రూ.50వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పీఎల్ఎస్ మూర్తి , కంఠాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరివాడని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా చెన్నేకొత్తపల్లి జాతీయ రహదారి కూడలి వద్ద శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు మునుపు అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

బుక్కరాయసముద్రం: భారతరత్న అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, కన్వీనర్ అశోక్, జిల్లా టీడీపీ నేతలు పసుపుల శ్రీరామిరెడ్డి,



అంబేడ్కర్‌కు కాంగ్రెస్ నాయకుల నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి (బీకేఎస్)

దండుశ్రీనివాసులు, కేశన్న, పొడరాళ్ల రవీంద్రా, లక్ష్మీనారాయణ, జీసీబాబు, చితంబరి తదితరులు పాల్గొన్నారు

● కాగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కూడలికి అంబేడ్కర్ పేరు పెట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ నల్లప్ప ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

అనంతపురం న్యూటౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివశంకర్ యాదవ్, ఈరన్న, ప్రధాన కార్యదర్శి ఇమామ్‌వలి, కార్యదర్శి హరిరాయల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ రవిరాజు పేర్కొన్నారు. మండలంలోని గార్లదిన్నె, కల్లూరు, కోటంక, ఇల్లూరు తదితర గ్రామాల్లో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరప్ప, నాగరాజు, బండారు కుళ్లాయప్ప, ఆదెన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

కనగానపల్లి: భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించి భావితరాలకు మార్గదర్శిగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎస్ఐ మహమ్మద్‌రిజ్వాన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం కనగానపల్లిలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మూర్తి, ఆంజనేయలు, అంకన్న, నరసింహులు, పోతన్న అంబేడ్కర్‌కు నివాళులు



కనగానపల్లిలో ....



చెన్నేకొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాలసునీత

అర్పించిన వారిలో ఉన్నారు.

శింగనమల: మండలంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. శింగనమలలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చిన్నజలాలపురం ఓబిలేసు రాము చిన్నజలాలపుం ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు బెస్త శంకర్ జిల్లా కాంగ్రెస్ ఓబీసీ నాయకుడు రాంచరణ్‌యాదవ్ వీరాంజి నివాళులర్పించారు.

నార్పల: నార్పల మేజర్ పంచాయతీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు తుపాకుల భాస్కర్, రహంతుల్లా, వినోదంలోకేష్ పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు మీనుగ రామాంజనేయులు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీ రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట, ముత్యాలంపల్లి గ్రామాలలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. బ్యాంకు ఖాతాదారులకు వర్తించే పథకాలు, కేంద్రప్రభుత్వం ప్రకటించిన రుణాలు, పథకాలు, పీఎంఎస్‌డీవై, పీఎంజేజేబీవై, డిజిటల్ లావాదేవీల గురించి వివరించారు. సైబర్ నేరాల గురించి ఎంవీరూరల్ ఫోక్ హార్ట్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందం చేత ప్రజలకు అర్థమయ్యేవిధంగా తెలియజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ డైరెక్టర్ జనరల్ మేనేజర్ రామాంజులు, అధికారులు సిద్ధారెడ్డి, వంశీ, రామగిరి కెనరా బ్యాంక్ మేనేజర్ చందన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

గోశాల నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున గోశాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా వట్టివాగులపల్లి గ్రామానికి చెందిన తోటంసింగ్ కుటుంబసభ్యులైన పరమేశ్వరసింగ్, రేఖ బాయి రూ.50లక్షల వ్యయంతో నూతన గోశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి భూమిపూజ చేయగా.. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం వారందరికీ అర్చకులు స్వామివారి దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వర్లు, వేదపండితులు అనంతపద్మనాభశర్మ, సాయికుమార్‌శర్మ, అర్చకులు చక్రవర్తి, విజయవర్ధన్, రాఘవేంద్ర, హరిచరణ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్‌కు ఎంపిక

గుత్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4, 5వ తేదీల్లో పాలిటెక్ ఫెస్ట్ 2024 అనే పేరుతో నిర్వహించిన జిల్లాస్థాయి సాంకేతిక పోటీల్లో గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారని కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం ఈసీఈ చదువుతున్న సైఫ్‌అలీ, మహ్మద్ అక్రమ్‌లు వైర్‌లెస్, ఎలక్ట్రికల్ వెహికల్, చార్జింగ్ సిస్టమ్ అనే అంశాన్ని ప్రదర్శించి ప్రతిభ చూపారని చెప్పారు. నిపుణులు కూడా వారి ప్రదర్శనను ఎంపిక చేశారన్నారు. ఆ విద్యార్థులు ఈనెల 18న రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, ఎండీ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి అభినందించారు.

రాయదుర్గంటౌన్: అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన ఇంజినీరింగ్ ప్రాజెక్టుల నమూనాల ప్రదర్శనలో రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్‌లో జిల్లాలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని తయారు చేసిన ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. ఇందులో రాయదుర్గం పాలిటెక్నిక్ పాఠశాల విద్యార్థులకు ద్వితీయ, తృతీయ స్థానాలలో ప్రతిభ చాటారు. జిల్లాస్థాయిలో మొదటి మూడు స్థానాలలో రెండింటిని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

అన్ని వార్డుల్లోనూ ప్యాచ్ వర్క్‌లు చేయాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్యాచ్ వర్క్ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి పేర్కొన్నారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణంలో ఎటుచూసినా గుంతలమైన రోడ్లు దర్శనమిస్తున్నాయన్నారు. అయితే కొన్ని చోట్ల ప్యాచ్ వర్క్‌లు చేసి మిగిలిన చోట వదిలేస్తున్నారన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు అన్ని వార్డుల్లో ప్యాచ్ వర్క్‌లు చేయాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చూస్తూ లైబ్రేరియన్ హఠాన్మరణం


ఓబులేసు (ఫైల్)

కళ్యాణదుర్గం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఓబులేసు సెల్‌ఫోన్ చూస్తూ హఠాన్మరణం చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉరవకొండ పట్టణానికి చెందిన ఓబులేసు కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాదిన్నర కాలంగా లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కూడా ఆయన యథావిధిగా విధులకు హాజరయ్యారు. తోటి అధ్యాపకులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి ఎంతో ఉల్లాసంగా గడిపారు. కొద్దిసేపటి తర్వాత లైబ్రరీ గదిలోని సెల్‌ఫోన్ చూస్తూ హఠాత్తుగా కుప్పకూలిపోయారు. వెంటనే తోటి అధ్యాపకులు గమనించి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఉమా దేవి ఉన్నారు. పిల్లలు లేరు. భర్త మృతి విషయం తెలుసుకున్న ఉమాదేవి రోదనలు మిన్నంటాయి. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

గుంతకల్లుటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆర్ఎంపీ, పీఎంపీలకు లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆడ ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, ప్రోగ్రాం అధికారి యుగంధర్, గైనాకాలజిస్ట్ సుజాత మాట్లాడుతూ.. రోజు రోజుకూ లింగ నిష్పత్తిలో మహిళల శాతం తగ్గిపోవడం తీవ్ర పరిణామాలకు దారితీస్తోందన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీల వద్దకు వైద్యం కోసం గర్భిణులు వస్తే.. కౌన్సెలింగ్ ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని తెలిపారు. గర్భిణులకు అబార్షన్‌కు సంబంధించి మందులు రాయడం చట్ట విరుద్ధమన్నారు. అలా చేస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. శిశువులను కాపాడుకుందాం, సృష్టిని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర, వైద్యురాలు హరిత, ఆరోగ్యబోధకులు వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆవులు తరలిస్తున్న ఆరుగురి అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో శుక్రవారం రూ.1.20లక్షల విలువగల నాలుగు ఆవులను తరలిస్తుండగా.. పట్టుకుని వాటిని తరలిస్తున్న ఆరుగురుని అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గన్నెవారిపల్లికాలనీలోని కుళ్లాయప్పకు చెందిన నాలుగు ఆవులను తాడిపత్రికి చెందిన దూదేకుల నబీ, బాషా, విజయ్‌కుమార్, నార్పలకు చెందిన పెద్దన్న, కుళ్లాయిస్వామి, దావీదు అపహరించి ఇతర ప్రాంతాలకు ఓ వాహనంలో తరలిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. దాడుల్లో నాలుగు ఆవులను స్వాధీనం చేసుకుని, ఆ ఆరుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పనులు కల్పించండి

తాడిపత్రి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని రంగప్పకాలనీలో ఉన్న కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక వేలాది మంది వలస బాట పడుతున్నారన్నారు. సొంత గ్రామాల్లోనే పనులు కల్పిస్తే కూలీలు ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే సంతోషంగా ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నాయకులు రామాంజనేయులు, సూర్యనారాయణ, నారాయణరెడ్డి, నాగరంగయ్య, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

యాడికి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూజల్లో మాలధారులు అధికంగా పాల్గొన్నారు. తర్వాత సాయంత్రం స్వామి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. గురుస్వాములు, మాలాధారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● ఆర్డీఓలు, తహసీల్దార్లు ● రైతుల నుంచి అర్జీల స్వీకరణ


గుత్తి మండలం ఎంగిలిబండలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు


కళ్యాణదుర్గం మండలం గోళ్ల సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

గుత్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని ఎంగిలిబండ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు ఈ రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భూమికి సంబంధించి ఏ సమస్య ఉన్నా ఈ సదస్సుల్లో అర్జీలు అందజేస్తే 45 రోజులలో పరిష్కరిస్తామని అన్నారు. తర్వాత గ్రామంలోని రైతులు 11 అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఓ ముస్తాక్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: మండలంలోని గోళ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో వసంతబాబు పాల్గొన్నారు. కొన్నేళ్లుగా పట్టిపీడిస్తున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ భాస్కర్, సర్పంచ్ గోళ్ల బొజ్జన్న, టీడీపీ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని కసాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. టీడీపీ నేత గుమ్మనూరు నారాయియణస్వామి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు రమాదేవి హాజరయ్యారు. అందులో రైతులు 28 అర్జీలను అధికారులకు అందజేశారు. రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని కోనాపురం, వెలిగొండ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు వివిధ భూసమస్యల పరిష్కారం కోరుతూ 29 అర్జీలను తహసీల్దార్ మహబూబ్‌బాషా కు సమర్పించారు. అలాగే వజ్రకరూరు మండలం రాగులపాడులోని రెవెన్యూ సదస్సులో 12అర్జీలను తహసీల్దారు నసీర్ అహ్మద్‌కు అందజేశారు.

పామిడి: మండలంలోని జీ కొట్టాల, దేవరపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు వివిధ భూ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ,టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని కడదరబెంచి గ్రామంలో రెవెన్యూ సదస్సు తహసీల్దారు సునితా బాయి ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో రైతులు 28 అర్జీలను సమర్పించారు.

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు 25 అర్జీలను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి అందజేశారు.

యల్లనూరు: మండలంలోని మేడికుర్తి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు 10 అర్జీలు అందజేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రాజా, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు అర్జీలను తహసీల్దార్ శ్రీనివాసులుకు అందజేశారు.

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తిలో రెవెన్యూ సదస్సు జరిగింది. వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ షర్మిల, ఆర్ఐ రమాదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సులో రైతులు తొమ్మిది అర్జీలు అందించినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీఓ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో రెవెన్యూ గ్రామసదస్సు జరిగింది. రైతులు 19 అర్జీలను తహశీల్దార్ మునివేలుకు అందజేశారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని మల్లాపురంలో రెవెన్యూసదస్సు జరిగింది. రైతులు 11 అర్జీలను తహశీల్దార్ నాగరాజుకు అందజేశారు.

శెట్టూరు: మండలంలోని కైరేవు, చెర్లోపల్లి, మారెంపల్లి, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు అర్జీలను తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి అందజేశారు.

డీ.హీరేహాళ్: మండలంలోని పులకుర్తిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో పలువురు రైతులు వివిధ భూసమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలను తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు అందజేశారు. వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో గుంతకల్లుకు రెండోస్థానం

సంబరాలు జరుపుకున్న టీడీపీ నాయకులు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే గుంతకల్లు నియోజకవర్గం రెండో స్థానంలో నిలిచింది. దీంతో పట్టణంలోని ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక 11వ వార్డు పార్టీ ఇన్‌చార్జి సరోజమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వాన్ని పొందడానికి ఎందరో స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. 50,260 సభ్యత్వాలు గుంతకల్లు నియోజకవర్గంలో జరిగాయన్నారు. దీంతో జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈ ఘనత ప్రతి నాయకుడికీ, కార్యకర్తకూ చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, ప్రభాకర్, గుజరీ మహమ్మద్ ఖాజా, శివన్న, అంజి, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, ఫజులు, ఫ్రూట్ మస్తాన్, వలిబాషా, పూల రమణ, పసుపుల హరిహరనాథ్, వనగొండి విజయలక్ష్మి, శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధరఘట్టలో సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ఇప్పటికే గ్రామంలో 500లకుపైగా నమోదు చేయించినట్లు కన్వీనర్ బలరాంరెడ్డి తెలిపారు. రూ.100 చెల్లించి సభ్యత్వ నమోదు తీసుకుంటే రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కురుబ కృష్ణ, తిప్పేస్వామి, టీడీపీ నాయకులు రవిచంద్ర సాగర్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

ఉరవకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ అర్బన్ సీఐగా మహానంది శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం పీటీసీలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సురేష్ వీఆర్‌కు వెళ్లారు.

895 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 895 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ -2కు 978 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపు సంగీత విభావరి

తాడిపత్రి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సినీ సంగీత దిగ్గజం దివంగత పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 8న సాయంత్రం 6గంటలకు సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గాయని కల్యాణి పాల్గొంటారన్నారు. సంగీతప్రియులు, ఘంటసాల అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

వందేళ్ల తర్వాత సీసీరోడ్డు


కాలనీలో సీసీరోడ్డు వేస్తున్న దృశ్యం

కణేకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నాగరికత ఎంత అభివృద్ధి చెందినప్పటికీ కొన్ని గ్రామాలు మాత్రం మౌలిక వసతులకు నోచుకోక అలాగే ఉంటున్నాయి. ఇందుకు ఉదాహరణ మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామం చెప్పుకోవచ్చు. గ్రామంలోని హెూరితాత కాలనీ ఏర్పడి వందేళ్లవుతుంది. అప్పటి నుంచి అక్కడ ప్రజలకు మట్టిరోడ్డే దిక్కు. తాజాగా కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలు వెచ్చించి సీసీరోడ్డు వేయడంతో స్థానికుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పలువురు మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు మారినా.. ఈ ప్రాంతంలో రోడ్డు వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం రోడ్డు వేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

పప్పుశనగన పంట పరిశీలన

పుట్లూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనగలగూడూరు గ్రామంలో శుక్రవారం పప్పుశనగ పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో సాగుచేసిన పంటలను ప్రతి రైతు నమోదు చేయించుకోవాలని సూచించారు. పప్పుశనగలో శనగపచ్చ పురుగు ఉందని, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. త్వరగా పంట నమోదు చేయాల'ని రైతుసేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఆమెవెంట ఏఓ కాత్యాయిని ఉన్నారు.

ఆర్డీటీ గృహాల ప్రారంభం

పెద్దవడుగూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురంలో ఆర్డీటీ సహకారంతో నిర్మించిన నూతన గృహాలను శుక్రవారం స్పెయిన్ దేశస్థులు ప్రారంభించారు. గ్రామంలోని నివాస గృహాలు లేని 42మంది పేదలను గుర్తించి ఆర్డీటీ రూ.1.20కోట్ల వ్యయంతో గృహాలను నిర్మించి అందజేసింది. వాటిని విదేశీయులు ప్రారంభించారు. ఆర్డీటీ గృహనిర్మాణాల శాఖ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సేవలు ఉచితమే

● డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్

పామిడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు ఉచితమేనని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ తెలిపారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యాధులతో ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా ఉచితంగా వైద్యం చేస్తామన్నారు. ప్రతి వ్యాధిగ్రస్తుడు ఆయుష్మాన్ భారత్ ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. వైద్యసేవలు ఆన్‌లైన్ ద్వారా డిజిటలైజ్ చేయబడతాయన్నారు. ఇతరుల మాటలు నమ్మి ఎలాంటి సర్టిఫికెట్లకు డబ్బులు ఇవ్వరాదని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల వైద్యాన్ని అరికడతాం: డీఎంహెచ్ఓ


బాధితుడితో వివరాలు సేకరిస్తున్న డీఎం హెచ్ఓ ఈబీ దేవి

పామిడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీల వైద్యం అరికడతామని డీఎంహెచ్ఓ ఈబీ దేవి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు శివ అనే యువకుడికి చేసిన వైద్యం వికటించి కాలు సెప్టిక్ అయింది. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా శుక్రవారం ఆమె విచారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆసుపత్రిలో లైసెన్స్ ఉన్న వైద్యుడు కాకుండా ఆర్ఎంపీ వైద్యుడు చికిత్స చేయడంతోనే శివ అనే యువకుడి కాలు సెప్టిక్ అయ్యిందన్నారు. దానిని నయం చేసుకునేందుకు రూ.లక్షలు వెచ్చించాల్సి వచ్చిందని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. అందులో భాగంగా ఆ ఆసుపత్రి వైద్య సేవలపై ఆరా తీస్తూ విచారణ చేపట్టామన్నారు. ప్రస్తుతం ముగ్గురు వైద్య నిపుణులతో కలెక్టర్ ఓ కమిటీ వేశారన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలకు సంబంధించి కేసు షీటు, కెమెరా విజువల్స్ అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో ఆర్ఎంపీ వైద్యుల నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిసిందన్నారు. అలాంటి ఆర్ఎంపీలపై చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలిపారు. డీఎంహెచ్ఓ వచ్చిన విషయం తెలుసుకుని ఆర్ఎంపీ వైద్యులు తమ ప్రథమ చికిత్సా కేంద్రాలు మూసివేయడం గమనార్హం.

టీడీపీ శాశ్వత సభ్యత్వం



నారా లోకేష్ చేతుల మీదుగా సభ్యత్వాన్ని పొందుతున్న వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఐటీ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. విజయవాడలో శుక్రవారం ఆయన నారా లోకేష్‌ను కలిసి ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. అనంతరం సీఎం చంద్రబాబును, మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసి గనులకు సంబంధించిన సమస్యలను విన్నవించారు.

బీటీపీ కాలువ మరమ్మతు పనులు ప్రారంభం


ఎక్స్‌కవేటర్‌తో కాలువలో పనులు చేపడుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి స్పందన

గుమ్మఘట్ట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీపీ ఎడమ కాలువకు మరమ్మతులు చేపట్టడంలో జాప్యంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి కాలువ మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. నాలుగు ఎక్స్‌కవేటర్లు, రెండు హిటాచీలతో కాలువ మరమ్మతుల పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు.


ఉడేగోళంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద ప్రభుత్వ విప్ కాలవ నివాళి



గుంతకల్లులో విగ్రహం వద్ద టీడీపీ నాయకుల నివాళి



తాడిపత్రిలో సీపీఐ నాయకులు..

మహోన్నతుడు.. బీఆర్ అంబేడ్కర్

● ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దాం
● వక్తల పిలుపు
● వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతిని గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో శుక్రవారం అన్ని వర్గాలు, పార్టీలు, సంఘాల నాయకులు, కార్యకర్తలు జరిపారు. ఈ సందర్భంగా కూడళ్లలోని ఆయన విగ్రహాలకు, అలాగే అన్ని కార్యాలయాలు, విద్యాలయాలు తదితర చోట్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన హక్కుల ద్వారానే అనేక మంది రిజర్వేషన్లు పొంది సంక్షేమ ఫలాలను అనుభవిస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. రాయదుర్గం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలోనూ, కణేకల్లు మండలంలోని ఉడేగోళంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. కళ్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సూచన మేరకు టీడీపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు స్థానిక ప్రజావేదిక వద్ద సేవలతోపాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన సుమారు 50 మందికి సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు.


కళ్యాణదుర్గంలో టీడీపీ నాయకులు..


యల్లనూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు..


బెళుగుప్పలోని సన్‌రైజర్స్ పాఠశాలలో నివాళులర్పించిన విద్యార్థులు